
# సత్యవాక్కు

సంపుటి - 44  జనవరి - 2023  సంచిక - 6



## క్రైస్తవ మాసపత్రిక

జనవరి - 2023

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

### టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు
### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| మంగళవారం మధ్యాహ్నం | : | 3.00 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| బుధవారం ఉదయం | : | 7.30 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం<br>రిక్కీ గూటం<br>రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

జనవరి విషయ సూచిక


1. మార్పుజెందని దేవుడు - పేజీ 3
2. దేవుని పిలుపు 7
3. ఆత్మతో ఆరాధించుట అనగానేమి? 13
4. సత్యముతో ఆరాధించుట యనగానేమి? 16
5. క్రీస్తు మనకొక మార్గము నిచ్చెను 19


## సత్యవాణి


పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ - 533 004.

Ph : 0884 - 2363722

98489 98[illegible] [illegible]ww.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 44 జనవరి - 2023 సంచిక -6


## మార్పుజెందని దేవుడు

"యెహోవానైన నేను మార్పు లేనివాడను" అని దేవుడు మలాకీ ద్వారా మనకు తెలియజేసియున్నారు. "యేసుక్రీస్తు నిన్న నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు, అవును యుగ యుగముల కును ఒక్కటే రీతిగా ఉండును" అని హెబ్రీ 13:8 చెప్పుచున్నది. భక్తుడైన దావీదు దేవుని గూర్చి ఇట్లు వ్రాసాడు: "నీ సంవత్సరములు తరతరము లుండును. ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతిపనులే. అవి నశించును గాని నీవు నిలిచియుందువు. అవన్నియు వస్త్రము వలె పాతగిలును. ఒకడు అంగవస్త్రమును తీసివేసినట్లు నీవు వాటిని తీసివేయుదువు, అవి మార్చ బడును. నీవు ఏకరీతిగా ఉండు వాడవు. నీ సంవత్సరములకు అంతములేదు" (కీర్తన 102:26,27). ఈ వచనములను బట్టి సంవత్సరము లెన్ని గతించినను దేవుడు మార్పులేని వాడని గ్రహించుకోగలము.

అయితే దేవుడు ఎవరు? అని మీరడుగవచ్చును. బైబిలు గ్రంథము "ఆదియందు దేవుడు" అను పదములతో ఆరంభమగుచున్నది.

ఎలోహిమ్ అను హెబ్రీ పదము నుండి దేవుడు అను పదము వచ్చినది. ఎలోహిమ్ ఒక బహువచనము. గనుక దేవునిలో తండ్రియైన దేవుడు (హెబ్రీ 45:2; 45:12), కుమారుడైన (వాక్యమైన) దేవుడగు యేసుక్రీస్తు (యోహాను 1:1-3, హెబ్రీ1:1,2), పరిశుద్ధాత్ము డైన దేవుడు (ఆది.కా. 1:2) ఏకమై యున్నారు. "పరమందు సాక్ష్యమిచ్చు వారు ముగ్గురు, తండ్రియు, వాక్యమును, పరిశుద్ధాత్మయును, వీరు ముగ్గురు ఏకమైయున్నారని" 1యెహాను 5:7లో ఆదిమగ్రీకుభాషలో వ్రాయబడి యున్నది. యోహాను 14:23-30 ఈ ముగ్గురు దైవత్వ ములో యున్న వ్యక్తులని తెలియజేయు చున్నది. యేసు తన తండ్రిని గూర్చి చెప్పారు (23వచ). మరియు ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్ముని గూర్చి చెప్పారు (26వచ). 28వ వచనములో నేను తండ్రి యొద్దకు వెళ్లుదును అని చెప్పారు. నేను తండ్రి యొద్దకు వెళ్లుచున్నానని 28వ వచనములో ఆయన చెప్పారు. గనుక దైవత్వము లో యున్న ముగ్గురు మూర్తులు సమానులు. అందుకే ఆయన త్రియేకు డైన దేవుడు.

తరవాత తండ్రియైన దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్మయు ఒకే తత్వము కలిగినవారై యున్నారు. వారి తత్వములో ఎన్నడు మార్పుయుండదు. "దేవుడు ప్రేమయైయున్నాడు" (1యోహాను 4:8). "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువ ప్రేమగల వాడెవడును లేడు" అని యేసు తన్నుగూర్చి చెప్పుకొన్నారు (యోహాను 15:13). యేసుప్రభువు ప్రేమయై యున్నారు. దేవుని ప్రేమ ఆయన యొక్క దీర్ఘశాంతములోను (2 పేతురు 3:9), తన ఏకైక కుమారుని మన కొరకు బలి యిచ్చుటలోను (యోహాను 3:16), సంఘము ద్వారా నశించిన మానవుని రక్షించుటకైన ఆయన సంకల్పములోను (ఎఫెసీ 3:10,11), ఆయన కృప, శాంతి, సమాధానములలోను (2 కొరింథీ

1:2,3) మిగతా అనేక విషయముల లోను బయలు పరచబడుచున్నది. ఆయన ప్రేమలో మార్పులేదు.

దేవుని యొక్క తత్వములో ఎన్నడు మార్పు యుండక పోయినను ఆయన నానా సమయములలో నానా విధములుగా తన చిత్తమును మానవులకు తెలియజేయుచు వచ్చారు. "పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినసుల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1,2). దేవునిలో మార్పులేకపోయినను ఆయన పనిచేసే విధానములో మార్పువున్నది. నోవహుకాలమందున్న పాపులను జలప్రళయము ద్వారా ఆయన నాశనము చేసారు (ఆది.కా. 6-8). ఇప్పుడైతే ఆయన కుమారుని రక్తముద్వారా పాపులను రక్షించుచున్నారు (మత్తయి 26:28; రోమా 5:9). మనము ఆయన ఆజ్ఞలకు లోబడినప్పుడు ఆయన రక్షించును (హెబ్రీ 5:8-10). మనము యేసుక్రీస్తు సువార్తను వినవలెను (రోమా 10:17). యేసుక్రీస్తు దేవుని కుమారుడని హృదయపూర్వకముగా విశ్వసించవలెను (అపో.కా. 8:37). పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (అపో.కా. 17:30) మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అపో.కా. 2:38; 22:16). అట్లు విధేయత చూపిన వారిని రక్షించి ఆయన తన సంఘముతో చేర్చు కొనును (మత్తయి 16:18; ఎఫెసీ 1: 22,23; 1కొరింధీ 12:13). క్రీస్తే తన సంఘమునకు శిరస్సయియున్నారు, అది ఆయన శరీరము (ఎఫెసీ 5:21 -33).

"సబ్బాతుదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" అని దేవుడు ఇశ్రాయేలీయులకు అజ్ఞాపించారు (నిర్గమ 20:8). గాని ఇప్పుడు ఆదివారము దినమున మనము క్రీస్తు యొక్క బలియాగమును జ్ఞాపకముంచుకోవాలని చెప్పియున్నారు

(1కొరింథీ 16:1,2; అపో.కా. 20:7). "ఇదియుగాక యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజకధర్మము సహా మార్చబడును" అని హెబ్రీ 7:13 లో చెప్పబడియున్నది. దేవునిలో మార్పులేక పోయినను ఆయన యిచ్చిన ఆజ్ఞలో మార్పును మనము చూచుచు న్నాము. మార్పులేని దేవుడు యాజకత్వ మును అహరోను సంతతినుండి యేసుక్రీస్తునకు మార్చారు (నిర్గమ 28:41; హెబ్రీ 3:1). ఇశ్రాయేలీయు లతో సీనాయి యొద్ద దేవుడు చేసిన నిబంధనను ఆయన క్రీస్తుసిలువలో మార్చారు (యిర్మీయా 31:31-34; కొలస్స 2:14-16). ఇప్పుడు ప్రతి క్రైస్తవుడు యాజకుడే. మనమధ్యవర్తి ఒక మానవుడు కాదుగాని యేసుక్రీస్తే (1తిమో2:5).

దేవుడు ఆది నుండి అనేక అద్భుతములు చేసారు. యేసుక్రీస్తు కూడ ఈ లోకములో యున్నప్పుడు అనేక అద్భుతములు చేసారు గాని అద్భుతములకు ఆయన అంతము పలికారు. గాని ఆయన యందు విశ్వాసముంచుటకు మనకు లిఖిత పూర్వక గ్రంథమునిచ్చారు: "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను, అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరునమ్ము నట్లును, నమ్మి ఆయన నామమందు మనము జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30, 31). క్రొత్తనిబంధన సంపూర్తిగ వ్రాయబడువరకు దేవుడు అద్భుత వరములనిచ్చారు. వారు చెప్పేది దేవుని వాక్యమని స్థిరపరచుటకు ఆయన అట్లు చేసారు, ఇప్పుడావాక్యము స్థిరపరచ బడియున్నది, క్రొత్తనిబంధన లిఖింప బడియున్నది గనుక అద్భుతములకు దేవుడు స్వస్తిపలికారు (హెబ్రీ 2:1-4).

దేవుడు గతంలో నానాసంగతు లను నానావిధములుగా చేసారు. యేసుక్రీస్తు వచ్చువరకు ఆయన అట్లు చేసారు (ఎఫెసీ 3:1-10). అవన్నియు

మానవుని రక్షణ సంకల్పము కొరకు బయలుపరచిన ఆయన చిత్తము. అయితే ఆయన తత్వములో మార్పు లేదు. యేసుక్రీస్తు ద్వారా ఆయన బయలుపరచిన రక్షణ సంకల్పములో మార్పులేదు. ఆయన స్థాపించిన ఏకైక సంఘములో మార్పులేదు. క్రొత్త నిబంధనలో మార్పులేదు. ఆయన సువార్తలో మార్పులేదు (రోమా 1:16), సత్యవాక్యములో మార్పులేదు (యోహాను 17:17). ఆయన వాక్యమునకు లోబడనియెడల ఆవాక్య సత్యముతోనే మనకు ఆయన తీర్పుతీర్చును. "నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడునని ఆయన ఇచ్చిన ఆజ్ఞలో మార్పులేదు (మార్కు16:16). మన దేవుడు మార్పులేనివాడు! యేసుక్రీస్తుద్వారా ఆయన యిచ్చిన ఆజ్ఞలలో మార్పులేదు! వాటిని మార్చువాడు శాపగ్రస్థుడు (ప్రకటన 28:18,19).

-జేమ్స్ పిల్‌గ్రిమ్

## దేవుని పిలుపు

మానవులు దేవుని పిల్లలగునట్లు మానవులను దేవుడు పిలుచుచున్నాడు. క్రీస్తునందున్న రక్షణ పొందు నిమిత్తము ఆయన మానవులను పిలుచుచున్నాడు. పరలోక నిత్యజీవమునకు వారసులు కమ్మని ఆయన మానవులను పిలుచుచున్నాడు. ఈ లోకములో మనకు అనేక రకములైన పిలుపులు రావచ్చును, అనేకమంది మనకు అనేక రకములైన ఆహ్వానములనీయవచ్చును. గాని ఈ రోజు మానవునికి దేవుడిచ్చు పిలుపును గూర్చి తెలిసికొందము. పాపమునుండి రక్షింపబడి పరలోకమునకు వారసులు కమ్మని ఆయన మానవులను పిలుచుచున్నాడు. "ఈ వాగ్దానము మీకును, మీపిల్లలకును, దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారందరికిని చెందునని" పేతురు చెప్పెను (అపొ.కా. 2:39).

అపొ.పౌలు ఇట్లనుచున్నాడు: "ప్రభువు వలన ప్రేమింపబడిన సహోదరులారా ఆత్మ మిమ్మును పరిశుద్ధపరచుట వలనను, మీరు సత్యమును నమ్ముట వలనను, రక్షణ పొందుటకు దేవుడు ఆది నుండి మిమ్మును ఏర్పరచుకొనెను గనుక మేము మిమ్మును బట్టి యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లింపబద్ధులమై యున్నాము. మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2 థెస్స2:13,14). ఈ వాక్యములను బట్టి దేవుడు మనుష్యులను పిలుచు చున్నాడని పేతురు, పౌలు కూడ సాక్ష్యమిచ్చుచున్నారు. దేవుడు మనలను పిలుచుచున్నప్పుడు ఆ పిలుపును నీవు నేను కూడ అంగీకరించవలెను.

**పరలోక పిలుపు** : దేవుని పిలుపు పరలోక పిలుపని లేఖనములు మనకు తెలియ జేయుచున్నవి. హెబ్రీపత్రిక వ్రాయ బడిన క్రైస్తవులు పరలోక సంబంధమైన పిలుపులో పాలు పొందిన వారని చెప్పబడెను (హెబ్రీ 3:1). దేవుని పిలుపు పరలోక సంబంధమైనది. పిలయనగా అది పరలోకమునుండి వచ్చినది మరియు పరలోకములో నిత్యజీవము కొరకు ఈయబడిన పిలుపు అది.

**ఉన్నత పిలుపు** : మానవులకు దేవుడిచ్చు పిలుపు ఉన్నతమైనది. "క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తుచున్నాను" అని అపొ.పౌలు చెప్పెను (ఫిలిప్పీ 3:14). ఉన్నత పిలుపనగా పైనుండి వచ్చిన పిలుపని అర్థము. అంతేకాకుండా ఈ ఉన్నత పిలుపుతో ఒక బహుమానము కూడ కలసియున్నది. ఎఫెసులోయున్న క్రైస్తవులతో దేవుని పిలుపునుగూర్చి మాట్లాడుచు వారు క్రీస్తునందు ఒకే నిరీక్షణ యుందుండుటకు పిలువబడి

తిరని పౌలు వారికి జ్ఞాపకము చేసెను (ఎఫెసీ 4:4). నిరీక్షణయను ఈ పదము ఒక ప్రత్యేకమైన దానికొరకు ఆశతో కనిపెట్టుట, ఆపేక్షించుటను తెలియజేయుచున్నది. దేవుడు మానవులకిచ్చు పిలుపులో నిజముగా ఒక బహుమానమున్నది. అది పరలోక నిత్య జీవ నిరీక్షణ. దేవునియొక్క పిలుపు పరలోకమునకు మనలను సిద్ధపరచును.

ప్రత్యేక పిలుపు :లేఖనముల ప్రకారము మనము ఒక ప్రత్యేకమైన పిలుపునకు పిలుప బడితివి. “మీరు పిలువబడిన పిలుపు నకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని” ఎఫెసీ 4:2లో పౌలు వ్రాసెను. దేవుని యొక్క పిలుపు ప్రత్యేకమైనది. క్రైస్తవ్యము పరిచర్య చేయునిమిత్తము దేవునిచే ఏర్పాటు చేయబడిన జీవితము. దేవునిచే పిలువబడుట యనగా నిజముగా ఆశీర్వదించబడుట యేగాక ఇతరులకుకూడ ఆశీర్వాదక రముగా యుండుటకు అవకాశము కలుగును. మనకు మనము సువార్త పిలుపునకు లోబడుటయేగాక ఇతరులకు సువార్తను బోధించే అవకాశము గొప్పది. క్రైస్తవుడు ఇతరులకు మేలు కరముగా యుండు నట్లు పిలువబడినవాడు. నమ్మకమైన క్రైస్తవుడు తన జీవితము అంతయు దేవుని చిత్తమును జరిగించుటకు పిలువడిన వాడని గ్రహించుకొనును.

దేవుడు మానవులను పిలుచునప్పుడు వారు పరిశుద్ధులుగా యుండుటకు పిలుచును. అపొ. పౌలు కొరింధీయులకు వ్రాసిన మొదటిపత్రికలో వారు క్రీస్తుయేసు నందు పరిశుద్ధ పరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని వారికి జ్ఞాపకము చేసెను (1కొరింధీ 1:2). పరిశుద్ధులనగా ఈ లోకము నుండి ప్రత్యేకింపబడి దేవునికొరకు ప్రతిష్ఠింప

బడినవారు. వారు దేవుని నిమిత్తము ప్రత్యేకింపబడినవారు గనుక పరిశుద్ధులు. దేవుని ప్రజలు పరిశుద్ధతను గూర్చి జాగ్రత్తకలిగి యుండవలెనని అపో. పేతురు హెచ్చరించుచున్నాడు: "మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి" యని అతడు వ్రాసెను (1 పేతురు 1:15).

**పరిశుద్ధులుగా యుండుటకు దేవుడు మానవులను పిలుచుచున్నాడు.** పాపముతోను, కల్మషముతోను నిండి యుండి నాశనమునకు లోనైన లోకము నుండి ఆయన ప్రజలను పిలుచు చున్నాడు. పరిశుద్ధులుగా యుండుటకు మాత్రమే గాకుండా, ఆయన కుమారుని తో సహవాసము కలిగియుండు నిమిత్తము దేవుడు మానవులను పిలుచుచున్నాడు. 1 కొరింథీ 1:9లో "మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" అని వ్రాయబడియున్నది. సహవాసము అనగా కలసి పనిచేయుట, పాలి భాగస్తులుగా యుండుట అని అర్థము. యేసుక్రీస్తుతో పాలి భాగస్థులుగా యుండు నిమిత్తము దేవుడు మానవులను పిలుచు చున్నాడు. ఆయన పనిలో క్రైస్తవులు క్రీస్తుతో పాలిభాగస్తులగుదురు. అందుకే ప్రభువు కార్యాభివృద్ధిలో మీరు ఎల్లప్పుడు ఆసక్తులై యుండుడి యని పౌలు క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (1కొరింథీ 15:58). శ్రమలలోకూడ క్రైస్తవులు క్రీస్తుతో పాలిభాగస్థులు కావలసియున్నది. క్రైస్తవులు దేవుని వారసులు; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, వారు క్రీస్తుతోడి వారసులు అని రోమా 8:17లో వ్రాయబడి యున్నది. అందువలన ఎవడైనను క్రైస్తవుడయినందుకు బాధననుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆపేరునుబట్టియే దేవుని మహిమ పరచ

వలెను (1పేతురు 4:16).

మనమింతవరకు చూచిన దేమంటే-దేవుని పిలుపు పరలోక సంబంధమైనది, అది ఉన్నతమైన పిలుపు, ఒక ప్రత్యేక పని నిమిత్తము దేవుడిచ్చిన పిలుపది. దేవుడు ప్రజలను ఈ లోకమునుండి వెలుపలికి పిలుచును గనుక వారు పరిశుద్ధులుగా యుండుటకు ఆయన వారిని పిలుచును. అంతేగాకుండా ప్రజలు క్రీస్తు యేసుతో సహవాస కలిగియుండుటకు ఆయన వారిని పిలుచును.

**అయితే దేవుడు మానవులను ఎట్లు పిలుచును?** అనే ప్రశ్న మనకు రావచ్చును. ఆయన మానవులను నేరుగా పిలుచుచున్నాడా? లేక దేనిద్వారానైనా పిలుచుచున్నాడా? ఆయన ప్రజలను నేరుగా, ప్రత్యక్షముగా పిలుచుచున్నాడను కొన్నప్పుడు మనము కొన్ని సమస్యల నెదుర్కొన వలసివచ్చును: అదేమంటే అనేకమంది ఇంకను ఆ పిలుపును పొందకుండా లోకములో ఎందుకు ఉన్నారు? బహు కొద్దిమంది మాత్రమే క్రీస్తుతో సహవాసము కలిగి యుండుటకు ఎందుకు పిలువ బడిరి? సహృదయత కలిగిన అనేకమంది దేవుడు వారిని స్వప్నములద్వారానో, దర్శనముల ద్వారానో, ఆయన స్వరము ద్వారానో పిలుచునని చెప్పబడి పెడ త్రోవను పెట్టబడియున్నారు, నిజమే.

అయితే మనము కొన్ని సత్యము లను గమనించుట అవుసరము: 1) మానవులందరు రక్షింపబడాలని దేవుడు కోరుచున్నాడు (1 తిమో 2:4; 2పేతురు 3:9). 2) దేవుడు పక్షపాతి కాడు (రోమా 2:11; అపొ.కా. 10:34). 3) రక్షింపబడువారికంటే నశించువారు ఎక్కువయుందురు (మత్తయి 7:13, 14).

**సువార్త పిలుపు :** దేవుడు మానవులను పిలుచు చున్నాడు గాని ఆయన వారిని సువార్త ద్వారా

పిలుచుచున్నాడు. ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను అని థెస్సలోనికయలోని క్రైస్తవులకు అపొ. పౌలు జ్ఞాపకము చేసెను. దేవుడు సువార్తద్వారా మానవులను పిలుచుచున్న యెడల మానవుడు ఆ సువార్త పిలుపును అంగీకరించవలెను; సువార్తను విని విశ్వసించి, దానికి విధేయత చూపవలెను. మానవులు సువార్త సత్యమును విశ్వసించి, దానిలోని ఆజ్ఞలకు లోబడినప్పుడు వారు దేవునిచే పిలువబడినవారగుదురు. సువార్త ద్వారా దేవుడు ఈ రోజు మిమ్మును పిలుచుచున్నాడు; మీరు ఈ లోకము నుండి ప్రత్యేకింపబడి ఆయనకు పరిశుద్ధులుగాను, ఆయన సేవకులుగాను, క్రీస్తుతో పాలి భాగస్థులుగాను ఉండవలెనని ఈరోజు ఆయన మిమ్మును పిలుచుచున్నాడు. సువార్తలో ఆయన యిచ్చుచున్న పిలుపును మీరు వినలేరా?

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును అని యేసుక్రీస్తు మిమ్మును పిలుచుచున్నాడు (మత్తయి 11:28). మీరు క్రీస్తు యిచ్చు పిలుపును అంగీకరించవలెనంటే, ఆయనే దేవుని కుమారుడని విశ్వసించండి, మీ పాపముల విషయమై మారు మనస్సు పొందండి, ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము పొందండి. క్రీస్తు యిచ్చు పిలుపునకు మీరు లోబడవలెనని కోరుచున్న యెడల మీకు సమీపముగాయున్న క్రీస్తు సంఘస్థుల నెవరినైనా సందర్శించండి. లేదా వెంటనే మాకు మీ కోరికను తెలియజేయండి.

“క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి” (రోమా 16:16).

–జాషువా గూటం

# ఆత్మతో ఆరాధించుట అనగానేమి?

పితరులు, ఇశ్రాయేలు జనాంగము, క్రొత్త నిబంధన సంఘము పరమందలి దేవదూతలు అందరు లేఖనములలో దేవునికి ఆరాధన చేయు చున్నట్లు చిత్రీకరించబడిరి. ఎందువలన? ఏలయనగా దేవుడు ఆరాధనీయుడు (ద్వితీ 6:4,5; కీర్తన 113). ఆయన ఒక్కడు మాత్రమే ఆరాధింపబడువాడు. దేవుని యొక్క గొప్ప మహాత్మ్యమును బట్టి ఆయన సృష్టియైన మనము భయభక్తులతో ఆరాధించవలెను (యెషయా 6:1-6; నిర్గమ 15:11; కీర్తన 148:1-14).

యాకోబు బావి దగ్గర యేసు సమరయ స్త్రీతో మాట్లాడుచు దేవుడు కోరు ఆరాధన యెట్టిదో తెలియజేసారు. "అయితే యదార్థముగా ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలమువచ్చు చున్నది. అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరు చున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:23, 24). ఆరాధనమూర్తి దేవుడే (మత్తయి 4:10). ఆరాధింప వలసిన విధానము సత్యము (యోహాను 17:17). ఆరాధన యొక్క హృదయము, మనస్సు ఆత్మయై యున్నది.

## దేవుని యొక్క ఆత్మయా? మానవుని ఆత్మయా?

భౌతికలోకములో దేవునికి గల సంబంధము ఆత్మీయము. దేవుడు ఆత్మయై యున్నారు. యేసును గూర్చి చెబుతు పౌలు "ఆయన సశరీరుడుగా ప్రత్యక్షకమాయెనని" చెప్పాడు (1 తిమోతి 3:16). యేసు పరిపూర్ణ దేవుడు. ఆయన నిత్యత్వము నుండియు వాక్యరూపమున యున్నవాడు (యోహాను 1:1-2). మానవులను పాపము నుండి విమోచించుటకు గాను ఆయన శరీరధారియాయెను (యోహాను 1:14; హెబ్రీ 10:5; ఫిలిప్పీ 2:5-8). గనుక ఆయన

ఇమ్మానుయేలు ఆయెను, అనగా దేవుడు మనతో యుండెను (మత్తయి 1:23).

మానవజాతి అయితే మొదటి నుండి శరీరము ధరించిన ఆత్మయై యుండిరి (ఆది.కా. 2:7). శరీరము నుండి ఆత్మవేరైపోయినప్పుడు మరణము సంభవించును (యాకోబు 2:26; ప్రసంగి 12:7). ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు శరీర మాలిన్యము కడిగివేయబడదు గాని అతని ఆత్మనూతన స్వభావమును ధరించుకొనును (1పేతురు 3:21; రోమా 6:1-4). మానవుని యొక్క హృదయములో, మనస్సులో అతని ఆత్మక్రీస్తు యొక్క సారూప్యములోనికి నూతనముగా మార్చబడును (రోమా 12:1-2; గలతీ 2:20; 1పేతురు 4:1-2).

అందువలన యేసు తన తండ్రియొక్క స్వభావమును బట్టి (ఆత్మ) శరీరముధరించిన ఆత్మలైన మానవు లందరు అంతరంగ స్వభావమును (ఆత్మను) బట్టి ఆరాధించాలని కోరు చున్నారు. "ఆత్మమూలముగాను, నీటి మూలముగాను" సంభవించు నూతన జన్మను నీకొదేము గ్రహించలేక పోయాడు (యోహాను 3:1,2). తిరిగి జన్మించిన మానవుని ఆత్మద్వారా చేయబడిన ఆరాధనయే అంగీకార యోగ్యమైనది (1కొరింధీ 2:13; 1 పేతురు 1:22, 23).

## నిర్మల హృదయముతో ఆయన సన్నిధికి రావలెను :

సమరయ స్త్రీతో యేసు సంభాషించుచు ఆయన రాజ్యములో అంగీకారయోగ్యమైన ఆరాధనకు స్థలముతో సంబంధముండదు అని తెలియజేసారు. అది గెరీజీముగాని, యెరూషలేముగాని కాదు గాని దేవుని బయల్పాటైన సత్యమును బట్టి ఉద్భ వించు స్తుతియై యున్నది. అంగీకార యోగ్యమైన ఆరాధన శరీరముద్వారా ఉద్భవించునను అది దేవునివాక్య మును బట్టి యుండును.

యోహాను 4:23,24కు సమానాంతరముగా యున్న బోధ మనకు యెహోషువా 24:14లో

యున్నది. "కాబట్టి మీరు యెహోవా యందు భయభక్తులుగలవారై ఆయనను నిష్కపటముగాను సత్యము గాను సేవించుచు, మీ పితరులు నది అద్దరిని ఐగుప్తులో సేవించిన దేవతలను తొలగద్రోసి యెహోవానే సేవించుడి". దీనిని యెహోషువా 24:13 మరింత విపులీకరించు చున్నది. "అలాగైతే మీ మధ్యనున్న అన్య దేవతలను తొలగద్రోసి ఇశ్రాయేలీయులు దేవుడైన యెహోవా తట్టు మీ హృదయాలను త్రిప్పు కొనుడి". విగ్రహారాధనలు చేసి యూదు లును పాపులైయుండిరి (రోమా 2: 17-22). వారి హృదయము, మనస్సు దేవుని నుండి తొలగిపోయినందున కలిగిన ఫలితమేమిటి? యూదులు దేవుని మహిమ పరచలేదు, ఆయన నామమును స్తుతించుటకు బదులు, దేవదూషణ చేయుచుండిరి.

రోమా 1,2 అధ్యాయములు మానవజాతి ఎల్లప్పుడు ఆరాధించును అని చెప్పుచున్నది. అది హృదయ పూర్వకముగా మన:పూర్వకముగా ఆత్మయైన దేవుని ఆరాధించుటయై యుండును, లేదా ఏదో ఒక విగ్రహాన్ని ఆరాధించుటయైనా యుండును.

**ముగింపు :**

ఆత్మతో ఆరాధించుట యనగా ఒకని హృదయము మనస్సు భయభక్తులతో, స్తుతులతో, నిష్కల్మషహృదయముతో దేవుని కొనియాడుట యగును. క్రీస్తులో యున్నవారు ప్రభువునందు ఆనందించుటకు అన్ని తరుణములను కలిగియున్నారు (ఫిలిప్పీ 4:4). "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). పరిశుద్ధులందరు యదార్ధ హృదయ ముతో వినయ భయభక్తులతో దేవుని ఆరాధించుదము గాక! వేషధారణ, గర్వము, అహంకారముతోకాదు! (మత్తయి 6:1-5; మార్కు 7:6-7; లూకా 18:9-14).

-బెన్ ఫిలిప్స్

# సత్యముతో ఆరాధించుట యనగానేమి?

ఇప్పుడొక ప్రాముఖ్య ప్రశ్నను గమనింతుము. మనం ఆరాధనకు ఎందుకు వెళ్లుచున్నాము? అనేకులు అనేక రీతులుగా దీనికి జవాబిస్తారు. ప్రజలు చెప్పే వివిధ కారణాలను మనం ప్రక్కన పెడదాం. సత్యము వివిధ రకాలుగా యుండుననే భావాన్ని ప్రక్కన పెడదాం. సత్యము ఎప్పుడు సత్యమే. అది అనేకరకాలుగా యుండదు. నీ సత్యము, నా సత్యము అస్సలుండదు. బహుళముగా యున్నది సత్యము కాదు, అది ఒకని యభిప్రాయం మాత్రమే. గనుక సత్యముతో ఆరాధించుటయనగా యేమిటి? ఆ సత్యాన్ని నేడు మనం తెలిసికొనగలమా?

సమరయ స్త్రీతో మాట్లాడుచు యేసు, "అమ్మా ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను, యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు, నా మాట నమ్ముము. మీరు మీకు తెలియని దానిని ఆరాధించువారు, మేము మాకు తెలిసిన దానిని ఆరాధించువారము. రక్షణ యూదులలోనుండియే కలుగుచున్నది. అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రికోరుచున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:21-24).

**మొట్టమొదటిగా బైబిలునందే సత్యమును కనుగొనగలము :**

"సత్యము నందు వారిని ప్రతిష్ఠ చేయుము, నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17). దేవుని వాక్యము సత్యము. యిది యూదులు చేసే నిష్ప్రయోజనమైన ఆరాధనకు భిన్నమైనది. వారు దేవుని వాక్యమును బట్టి గాక తమ పెదవులతోనే ఆరాధించేవారు. "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృద

యము నాకు దూరముగాయున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" (మత్తయి 15:9). ఆరాధన మూర్తి మనము కాదు గాని దేవుడే గనుక, మనం ఆయననెట్లు ఆరాధించాలో ఆయనే నిర్ధారించును. దేవుని ఎట్లు ఆరాధించాలో చెప్పేవాడు మానవుడు కాజాలడు.

**దేవుని మాదిరిని బట్టి :** ప్రయోజనకరమైన ఆరాధనను మనం చేయాలంటే, దేవుడిచ్చిన మాదిరిని బట్టియే దాన్ని చేయాలి. ఆయన యిచ్చిన మాదిరిని అనుసరిం చని వారు దేవునికిష్టులుకారు. పాత నిబంధనలో ఒక ఉదాహరణ ఇక్కడ చూద్దాం. "అహరోను కుమారులైన నాదాబు, అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పు లుంచి వాటి మీద ధూపద్రవ్యముంచి యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరు వారిని కాల్చివేసెను, వారు యెహోవా సన్నిధిని మృతి బొందిరి" (లేవీ 10:1-3). దేవుని సత్యముతో ఆరాధించుట అంటే ఆయన యిచ్చిన ఆరాధన నమూనాను పాటించుటయే. ఈ ఆరాధన కేవలం దేవునికే కేంద్రీకృతమై యుండాలి. యేసును శోధించు చున్న అపవాదితో, "సాతానా పొమ్ము, ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింప వలెననెను" (మత్తయి 4:10).

సత్యముతో దేవుని నారాధించుటకు క్రైస్తవులు అనుసరించవలసిన నమూనా యేది? ఆదిమ సంఘము ఆదివారమున చందానిచ్చుటకు కూడుకొనిరి. "నేను వచ్చినప్పుడు చందాపోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1కొరింథీ 16:2). ఆదిమ సంఘము రొట్టెవిరుచుటకు ప్రతి ఆదివారమున కూడుకొనిరి (మత్తయి 26:26-29; 1 కొరింథీ 11:18-25). దేవుని ఆరాధనలో క్రైస్తవులు ప్రార్థించాలి, వాద్యములు లేకుండా

పాటలు పాడాలి అని హెచ్చరింప బడిరి. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును. ఆత్మతోపాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరింథీ 14:15; ఎఫెసీ 5:19; కొలస్స 3:16). ప్రతి ఆదివారమున వాక్య ఉపదేశము జరిగించబడాలని క్రైస్తవులకు హెచ్చరిక ఈయబడినది. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనైయుండి వారితో అర్ధరాత్రివరకు ప్రార్థించు చుండెను" (అపొ.కా. 20:7).

ఈ హెచ్చరికలు ప్రతి క్రైస్తవుడు గైకొనవలెను. అపొ. పౌలు ఇట్లు వ్రాసాడు: "ఇందు నిమిత్తము ప్రభువు నందు నా ప్రియుడును, నమ్మకమైన నా కుమారుడునగు తిమోతిని మీ యొద్దకు పంపియున్నాను. అతడు క్రీస్తు నందునేనునడుచుకొను విధమును అనగా ప్రతిస్థలములోను, ప్రతి సంఘములోను నేను బోధించు విధమును మీకు జ్ఞాపకముచేయును" (1 కొరింథీ 4:17). అట్లు సంఘ సభ్యు లందరు ఏకమనస్సు ఏకతాత్పర్యము కలిగియుండి ఒకే నియమము చొప్పున నడుతురు. "సహోదరులారా మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు మీలో కక్షలు లేక యేకమనస్సుతోను, ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మిమ్మును వేడుకొను చున్నాను" అని పౌలు వ్రాసాడు (1 కొరింథీ 1:10).

యదార్థమైన ఆరాధన దేవుని చిత్త ప్రకారము ముండవలెనుగాని మన యిష్టానుసారముగా కాదు. మనము దేవుని నిష్కపటముగా ఆరాధించాలి. ఆయారాధన సత్యవాక్య ప్రకారమైనదై యుండాలి. కొందరు ఎంత నిష్కపటు లైనను వాక్యమునుబట్టి ఆరాధించరు. నైతికంగా సత్ప్రవర్తునులే అయినను వారి ఆరాధన సత్యారాధన కాదు. మానవుల కల్పిత బోధలను, ఆచారము లను విడిచి దేవుని వాక్యము చెప్పు రీతిగా ఆరాధించుటకు అందరు ప్రయత్నించాలి. దేవుని వాక్యమే సత్యము!!

–హేంక్ లారెన్స్

# క్రీస్తు మనకొక మార్గము నిచ్చెను

అపొస్తలుడైన పేతురు ఇట్లు వ్రాసాడు : "ఆయన జగత్తుపునాది వేయబడకముందే నియమింపబడెను గాని తన్ను మృతులలోనుండి లేపి తనకు మహిమనిచ్చిన దేవుని యెడల తన ద్వారా విశ్వాసులైన మీ నిమిత్తము కడవరికాలములయందు ఆయన ప్రత్యక్షపరచబడెను. కాగా మీ విశ్వాసమును నిరీక్షణయు దేవుని యందు ఉంచబడియున్నది. మీరు క్షయ బీజమునుండి గాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యము మూలముగా పుట్టింపబడిన వారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగు నట్లు మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్రపరచుకొనిన వారై యుండి యొకని నొకడు హృదయపూర్వకము గాను మిక్కుటముగాను ప్రేమించుడి. ఏలయనగా సర్వశరీరులు గడ్డిని పోలిన వారు. వారి అందమంతయు గడ్డిపువ్వు వలె ఉన్నది. గడ్డి ఎండును దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" (1పేతురు 1:21-25). మనలను రక్షించుటకే యేసు ప్రభువు వచ్చెను. ఆయన యొక్క లక్షణములను మనము అలవర చుకొనవలెను (లూకా 17:10; 1పేతురు 2:21). యేసు యొక్క అంతరంగ లక్షణములను మనము అనుకరించాలి.

**మొదటిగా యేసుక్రీస్తు వినయము గలవాడు.** "నా అంతట నేనే ఏమియు చేయలేను. నేను విను నట్లుగా తీర్పుతీర్చుచున్నాను. నన్ను పంపినవాని చిత్తప్రకారమే చేయగోరు దును కాని నా యిష్టప్రకారము చేయ గోరను గనుక నా తీర్పు న్యాయమైనది" యని ఆయన చెప్పెను (యోహాను 5:30). అట్టి స్వభావము కలిగి యుండుటయే క్రైస్తవుని ధ్యేయమై

యుండాలి (ఫిలిప్పీ 2:5-8). దేవుని వాక్యమును బట్టియే క్రీస్తు అట్లు అనుకరించెను. "మనమందరము ముసుకులేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింప జేయుచు మహిమ నుండి అధిక మహిమ పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలిక గానే మార్చబడు చున్నాము" (2 కొరింథీ 3:18).

ఇట్టి వినయత్వమును పౌలు స్వీకరించినవాడై "పరిశుద్ధులందరిలో అత్యల్పుడైన నాకు ఈ కృప అను గ్రహించెను" అని వ్రాసాడు (ఎఫెసీ 3:8). జ్ఞానియైన సొలొమోను "యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట వినయమునకు ప్రతి ఫలము" అని చెప్పాడు (సామెతలు 22:4).

రెండవదిగా యేసు ప్రభువు నిస్వార్థ హృదయుడు. ఏ విషయము లోను ఆయన స్వార్ధపరత్వము ప్రదర్శించలేదు. భౌతిక సంగతులను ఆయన ఎన్నడు కాంక్షించలేదు. సరిగదా ఆయనకున్న దేదో అది యిచ్చేసారు (అపొ.కా. 20:35). మన ప్రభువు యొక్క నిస్వార్థ లక్షణము [illegible] ఇచ్చుటలో మనము దీవించబడ[illegible]మి. "ఇయ్యుడి అప్పుడు మీకియ్యబడును. అణిచి, కుదిలించి దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ బడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని" ఆయన చెప్పారు (లూకా 6:38). నిజానికి కొరింధులోని సంఘానికి పౌలు ఇట్లు హెచ్చరిక చేసాడు. "సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహాముగా ఇచ్చువానిని ప్రేమించును. మరియు అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధి గలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరించగలడు"

(2 కొరింధీ 9:7,8) క్రీస్తు అనుచరులలో ఎవడును స్వార్ధపరుడుగా యుండకూడదు.

మూడవదిగా యేసు జాలి గలవాడు. "యేసు వచ్చి ఆ గొప్ప జన సమూహమును చూచి వారు కాపరి లేని గొర్రెలవలె యున్నందున వారి మీద కనికరపడి, వారికి అనేక సంగతులు బోధింపసాగెను" (మార్కు 6:34). ఇట్టి అంతరంగ స్వభావము లేకుండా ఎవడు క్రైస్తవుడుగా యుండ నేరడు. "సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తు నందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:31, 32).

నాల్గవదిగా యేసు అంతరంగిక ఆనందమును ప్రదర్శించారు. ఆయనను వెంబండించు వారందరిక ఆయన యేమి ఈయగలడో ఆయన ఎరిగినవాడై యుండెను. "దొంగ దొంగ తనమును హత్యను నాశనమును చేయుటకు వచ్చును గాని మరిదేనికిని రాడు. గొర్రెలకు జీవము కలుగుట కును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని" యేసు నిశ్చయముగా చెప్పెను (యోహాను 10:10). "మన సంతోషము పరిపూర్ణమవుటకై ఈ సంగతులను వ్రాయుచున్నాము" అని చెబుతూ యెహాను తన మొదటి పత్రికలో వ్రాసాడు (1 యోహాను 1:4).

అయిదవదిగా యేసు ప్రభువు యొక్క అంతరంగ ప్రేమను కనుబర చారు "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండు టకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమ యున్నది. ప్రియులారా దేవుడు మనలను ఈలాగు ప్రేమింపగా మనమొకని నొకడు ప్రేమింప బద్ధులమై యున్నాము" (1

యోహాను 4:10,11). మరల "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" అని అతడు వ్రాసెను (1యోహాను 4:19). "ఎవడైనను నేను దేవుని ప్రేమించు చున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడలేని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయన వలన పొంది యున్నాము" (1 యోహాను 4:20, 21).

క్రీస్తు యొక్క లక్షణములను బట్టి మన అంతరంగ పురుషుడు అను దినము నూతన పరచబడుచున్నాడు (2కొరింథీ 4:16). యేసుక్రీస్తు యొక్క లక్షణములను గ్రహించుకొని వాటిని మన దైనందిన జీవితములో అలవరచు కొనుటయే మన ధ్యేయమై యుండాలి. వాటిని క్రియారూపముగా ప్రదర్శించాలి.

– కేత్ మోషెర్

---

**సత్యవాక్కు సభ్యత్వ రుసుమును గాని పుస్తకముల కొరకు గాని ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపించువారు దిగువనీయబడిన QR కోడ్ ను వినియోగించగలరు.**

# సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్

2 తిమోతి 2:15, "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాని గాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము."

మీరు దైవసేవకులగుటకు ఆసక్తి కల్గియున్నారా? మీరు దేవుని వాక్యమును ప్రకటింపగోరుచున్నారా? మీరు దేవుడు చూపించిన రక్షణ మార్గములో నడవాలని కోరిక కల్గియున్నారా? మీరు దేవుని సేవించువారైయుండి ఇంకా బాగుగా వాక్యమును చెప్పాలని కోరిక కల్గియున్నారా?

**అయితే ఇదే మీకు సదావకాశము!**

ఎన్నో దశాబ్దాలుగా రేడియో, టివి, మాసపత్రికలతో, దైవసేవ చేస్తున్న సహో. జాషువా గూటం గారి కుటుంబము సత్యవాణి క్రీస్తు సంఘము కాకినాడలో మీ నిమిత్తము 6 వారములు అడ్వాన్స్‌డ్ బైబిలు కోర్సును ప్రారంభించిరి. మరియు ఆన్‌లైన్ క్లాసులు కూడా ప్రారంభించబడినవి. జూమ్ యాప్ ద్వారా మీరు ఈ కోర్సులో చేరవచ్చును. మీ సెల్‌ఫోన్, లేదా కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ క్లాసులలో పాలు పొందవచ్చును. ఈ స్కూల్‌లో చేరినవారికి ఉచిత బైబిల్ శిక్షణ, వసతి, భోజన సౌకర్యము కలదు. కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు స్టయిఫండ్‌తో పాటు పాటల సిడీ, ఒక బైబిల్ గిఫ్ట్‌గా ఇయ్యబడును. సీట్లు పరిమితముగా ఉన్నవి గనుక మీరు వెంటనే ఈ దిగువ నెంబరును సంప్రదించగలరు.

**98489 98547**

సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా అందించుచున్న

**ఉచిత బైబిలు కరేస్పాండెన్సు కోర్సులో చేరండి.**

అందులోవున్న 26 పాఠములను చదివి, మీ యింటివద్దనే ప్రశ్నాపత్రములను పూర్తిచేయండి. వెంటనే మీకొక యోగ్యతా పత్రము, ఒక బైబిలు కూడ బహుమతిగా ఇయ్యబడును.

మీరు, మీ బంధుమిత్రులు ఈ రోజే చేరండి.
మీ అడ్రసును మాకు ఫోన్ ద్వారా గాని, పోస్టుద్వారా గాని తెలియజేయగానే వెంటనే పాఠములు పంపబడును.

**సత్యవాణి - క్రీస్తు సంఘము**
**పోస్ట్‌బాక్స్ -80, కాకినాడ - 533 001.**
**ఫోన్ : 98489 98547, 0884-2363722**

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్, ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004